క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ కాపుల ఆత్మీయ సమావేశం

ముమ్మిడివరం: ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కాపుల ఆత్మీయ సమావేశం తానేల్లంక జగతా పద్మనాభం స్వగృహ ఆవరణలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు సీనియర్ నాయకులు ఏడిద చక్రపాణిరావు తెలిపారు. సమావేశంలో అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, ముమ్మిడివరం అసెంబ్లీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ విజయాన్ని ఆకాంక్షిస్తూ వారికి సంఘీభావం తెలుపుతామన్నారు. సమావేశానికి నియోజకవర్గ పార్టీ కాపు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మూడో రోజు ఒక్క నామినేషన్ దాఖలు



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వనచర్ల బాబ్జి

ముమ్మిడివరం: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మూడో రోజు శనివారం ఒక నామినేషన్ దాఖలైంది. జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా వనచర్ల బాబ్జి నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహనరావుకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

మంత్రికి వినతి పత్రం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: మండలంలోని బెండమూర్లంకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్‌కు క్రైస్తవుల సమస్యలపై వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ జిల్లా కార్యదర్శి పల్లి జేమ్స్‌రాజు ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద స్థానిక క్రైస్తవులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారందరితో సమావేశమైన మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. అనంతరం పాస్టర్ల ఫెలోషిప్ సభ్యులు మంత్రి విశ్వరూప్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, పెమ్మాడి సాయి, పాస్టర్ల ఫెలోషిప్ సభ్యులు జాషువా, బర్నబాసు, మోజెస్, లూక్ భాస్కర్‌రావు, ప్రసాద్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని వాసాలతిప్పలో వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. అమలాపురం కేర్ హాస్పటల్ వైద్యులు కారెం రవితేజ దంపతులు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్చకులు గణపతి పూజ, హోమం జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రారంభోత్సవానికి సహకరించిన డాక్టర్ శ్రావణి, జస్విక్ శ్రేయాస్‌వర్మలను గ్రామస్తులు సత్కరించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు.

మద్యం పట్టివేత

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన కె.వెంకటలక్ష్మి ఇంట్లో అక్రమంగా దాచిన 57 మద్యం సీసాలను రెవెన్యూ అధికారుల సహాయంతో శనివారం సోదాలు నిర్వహించి పట్టుకున్నారు. వెంకటలక్ష్మిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఆమెకు రిమాండ్ విధించిందని ఎస్‌ఐ కె.మనోహర జోషి తెలిపారు.

మద్యం, సారా ధ్వంసం

అమలాపురం టౌన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అమలాపురం స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 168.89 లీటర్ల మద్యం, 10.8 లీటర్ల నాటు సారాను శనివారం సాయంత్రం స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్ఈబీ ఇన్‌చార్జి, జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అమరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు.

నేడు మద్యం షాపుల మూసివేత

యానాం: ఈ నెల 21వ తేదీ ఆదివారం మహావీర్ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని లైసెన్స్ కలిగిన ఎఫ్ఎల్-1, 2, టూరిజం కేటగిరీ మద్యం షాపులను మూసివేయాలని డిప్యూటీ కమిషనర్(ఎక్సైజ్) ఆర్.మునిస్వామి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా లిక్కర్ సప్లయ్ చేసే రెస్టారెంట్లు, బార్లు సైతం మూసేయాలన్నారు.

రహదారులకు రాచబాట



టీడీపీ హయాంలో గుంతులమయంగా ఉన్న ఉప్పలగుప్తం-ఎన్.కొత్తపల్లి రహదారి



నేడు సుందరంగా ఉప్పలగుప్తం-ఎన్.కొత్తపల్లి రహదారి



నాడు అధ్వానంగా ఉన్న కాట్రేనికోన-ఎస్.యానం ప్రధాన రహదారి



నేడు అద్దంలా మారిన కాట్రేనికోన-ఎస్.యానం ప్రధాన రహదారి

- మంత్రి విశ్వరూప్ చొరవతో పల్లెల్లో రోడ్ల అభివృద్ధి
- టీడీపీ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేసిన రోడ్లవి

ఉప్పలగుప్తం: 2014 నుంచి 2019 వరకూ టీడీపీ హయాంలో తీర ప్రాంతంలో ఇసుక, మట్టి మాఫియా కారణంగా భారీ ట్రక్కుల రాకపోకలతో దెబ్బతిన్న రహదారులవి. గుంతలమయంగా మారిన రోడ్ల వల్ల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నా నాడు ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఆఖరికి అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు సొంత మండలమైన ఉప్పలగుప్తంలో మొక్కుబడి మరమ్మతులే తప్ప కనీసం ఒక్కటంటే ఒక్క రోడ్డైనా వేయించలేకపోయారన్న అపవాదు ప్రజల్లో మూటగట్టుకున్నారు. మరోవైపు పినిపే విశ్వరూప్ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను ఆధునీకరిస్తామని 2019 ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. చెప్పినట్టుగానే మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారులన్నింటినీ రాచబాటలుగా మార్చి పూర్తి స్థాయిలో ఆధునీకరించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ప్రస్తుతం ఈ రహదారుల అంశం ప్రజల్లో చర్చనీయాంశమైంది.

అప్పుడూ ఆయనే.. ఇప్పుడు ఆయనే..

- ఉప్పలగుప్తం మండలంలో ప్రధాన రహదారిగా ఉన్న ఉప్పలగుప్తం-ఎస్.కొత్తపల్లి రహదారికి 2013 సమయంలో మంత్రిగా కొనసాగుతున్న విశ్వరూప్ నిధులను సమకూర్చి పూర్తి స్థాయిలో రోడ్డును ఆధునీకరించారు. తరువాత ఎమ్మెల్యేగా గెలుపొందిన అయితాబత్తుల ఆనందరావు రోడ్డు అధ్వానంగా మారినా ఒకసారి మరమ్మతులు చేయించి చేతులు దులిపేసుకున్నారు. మళ్లీ 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందిన విశ్వరూప్ 3.6 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రోడ్డును రూ.2 కోట్ల ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులతో పూర్తి స్థాయిలో ఆధునీకరించారు.
- మునిపల్లి-సరిపల్లి ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయిపాలెం నుంచి విలసవిల్లి, రెడ్డిపల్లి గ్రామాల మీదుగా కామనగరువు వరకూ రెండు కిలోమీటర్ల పొడవునా గత టీడీపీ హయాంలో మట్టి రోడ్డు ఉండేది. మంత్రి విశ్వరూప్ ప్రత్యేక చొరవ తీసుకుని రూ.1.92 కోట్లతో బీటీ రోడ్డును నిర్మించారు.
- కూనవరం నుంచి గొల్లవిల్లి వరకూ 2014లో విశ్వరూప్ శంకుస్థాపన చేసిన రోడ్డును టీడీపీ హయాంలో గాలికొదిలేశారు. మళ్లీ విశ్వరూప్ 2019లో వైఎస్సార్ సీపీ హయాంలో గెలిచిన తరువాత రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డును నిర్మించారు. దాంట్లో భాగంగా గొల్లవిల్లి నుంచి సన్నవిల్లి వరకూ రూ.36 లక్షలతో మిగిలిన పనులను చేయిస్తున్నారు.
- ఉప్పలగుప్తం పంచాయతీ పరిధిలో దళితవాడలైన కామరాజుపేట, పేరాయిచెరువులో అధ్వానంగా ఉన్న రోడ్లను ఆధునీకరించడానికి రూ.98 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టారు.
- మత్స్యకార గ్రామాలైన ఎస్.యానం, ఎన్.కొత్తపల్లి ప్రజలకు మత్స్య సంపదను విక్రయించాలంటే పక్క మండలం కాట్రేనికోనకు వెళ్లాల్సిందే. ఆ ప్రాంతం వైపు వెళ్లే రోడ్డు గత కొన్నేళ్లుగా అధ్వానంగా ఉన్నా అప్పటి ఎమ్మెల్యే ఆనందరావు వాటిపై దృష్టి సారించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంత్రి విశ్వరూప్ చొరవతో రూ.2.6 కోట్లతో ఆ రహదారిని బీటీ రోడ్డుగా నిర్మించారు.
- మండలంలోని ప్రధాన రహదారులన్నింటినీ రాచబాటలుగా మార్చడంతో ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారు.

అప్పట్లో చాలా ఇబ్బంది పడేవాళ్లం



నేను ఒక వ్యాన్ యజమానిని. గత టీడీపీ ప్రభుత్వంలో రోడ్ల మరమ్మతులు చేయక మా వాహనం పాడై తరచూ పెట్టుబడులు పెట్టాల్సి వచ్చేది. గ్రామీణ రోడ్లపై కాకుండా కొండల ప్రాంతాల్లో ప్రయాణం చేసినట్టు ఉండేది. మరోవైపు టీడీపీ నాయకులు మా పక్క గ్రామమైన ఎస్.కొత్తపల్లి నుంచి భారీ ట్రక్కులతో మట్టి రవాణా చేసేవారు. దీనివల్ల రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు పడి దారుణంగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం మంత్రి విశ్వరూప్ చొరవతో ఆ ఇబ్బందులన్నింటి నుంచి బయట పడ్డాం.

– నల్లా శ్రీనివాస్, వ్యాన్ యజమాని, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

ప్రజల ఇక్కట్లు తొలగించారు



సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో మంది నాయకులకు మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. కాని మంత్రి విశ్వరూప్ చొరవతో మా గ్రామానికి బీటీ రోడ్డు పడింది. విశ్వరూప్ మా గ్రామానికి వచ్చినప్పుడు ఇచ్చిన మాటను మరిచిపోకుండా నెరవేర్చి ప్రజల ఇక్కట్లు తొలగించారు. మా ప్రాంత ప్రజలందరూ విశ్వరూప్‌కు రుణపడి ఉంటాం.

– వడ్డి రాజేష్, వడ్డివారిపేట, విలసవిల్లి, ఉప్పలగుప్తం మండలం

మంత్రి విశ్వరూప్ చొరవతోనే



మా ఎస్.కొత్తపల్లి గ్రామ ప్రజలు ఏ పనికైనా ఊరు దాటాలంటే ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ఎస్.యానం గ్రామాల మీదుగానే వెళ్లాలి. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ మూడు గ్రామాల రోడ్లు చాలా అధ్వానంగా ఉండేవి. గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి ఉండేది. మంత్రి విశ్వరూప్ చొరవ చూపించి మూడు గ్రామాలకు రహదారులు వేశారు.

– కుంచే చిట్టికుమారి, సర్పంచ్, ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం మండలం

సంక్షేమం కొనసాగాలంటే జగనన్నే రావాలి



బెండమూర్లంకలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్



ప్రచార రథం పైనుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- బెండమూర్లంకలో ఎన్నికల ప్రచారం

అల్లవరం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అల్లవరం మండలం బెండమూర్లంక గ్రామంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన మంత్రి విశ్వరూప్‌కు బెండమూర్లంక గ్రామస్తులు ఘన స్వాగతం పలికి మంగళ హారతులతో నీరాజనాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమం ప్రతి పేదవాడికి పారదర్శకంగా అందుతుందని, గ్రామాలు అభివృద్ధిని సాధిస్తాయని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2,75,000 కోట్ల నిధులను లబ్ధిదారులకు ఖాతాల్లోకి మళ్లించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటుచేసి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందించారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు కొనసాగాలంటే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించాలని మంత్రి విశ్వరూప్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, వంటెద్దు వెంకయ్యనాయుడు, వైస్ ఎంపీపీ ముత్యాల రామకృష్ణ, వడ్డి గంగ, సర్పంచ్ బర్రే సీతారత్నం, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు, ఉప సర్పంచ్ కుప్పాల దొరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు గుర్రం చిన్నబ్బాయి, యాళ్ల మామాజీ, రేవు సుందరరావు, బర్రే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్న ప్రభుత్వానికి మద్దతు పలకండి



మహాలక్ష్మినగర్‌లో ఫ్యాను గుర్తుకు ఓటేయాలంటూ అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- జార్జిపేట, నీలపల్లి గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం

తాళ్లరేవు: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలికి రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన జార్జిపేట, నీలపల్లి గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పితాని బాలకృష్ణ, కాశి బాలమునికుమారి, స్థానిక నాయకులతో కలిసి జోరుగా ఎన్నికల ప్రచారం, రోడ్‌షో నిర్వహించారు. తొలుత నీలపల్లమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే పొన్నాడకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన కొనసాగుతుందన్నారు. ప్రజా సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి తనను ఎమ్మెల్యేగా, రాపాక వరప్రసాదరావును ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, కాటంశెట్టి రామ్మూర్తి, రెడ్డి సతీష్, రేవు మల్లీశ్వరి, రెడ్డి నాగేశ్వరరావు, పెట్ల సూర్యనారాయణ రాజు, మోకా మధుబాబు, పేర్ని ఆదినారాయణ మూర్తి, కట్టా దుర్గారావు, శీలి రాజు, పువ్వల కృష్ణమూర్తి, వెంటపల్లి వాసంతి, పెట్ల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర చైత్ర మాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి పి.మల్లవరం గ్రామంలో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు ఖండవిల్లి శ్రీరంగాచార్యులు, శ్రీనివాసాచార్యులు తదితరుల బృందంచే ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చక బృందం

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్త జనం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న కల్యాణోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రీతిపాత్రమైన శనివారం రోజున దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. బారులు తీరి స్వామివారి దర్శనం చేసుకున్నారు. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా రాత్రి 6.32 గంటలకు స్వామి, అమ్మవార్లను పొన్న వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. దేవస్థానంలో రోజూ కోలాటం, చిన్నారుల నృత్య రూపకాలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను రంజింపచేస్తున్నాయి.



విద్యుత్ వెలుగుల్లో వేంకటేశ్వరస్వామి దేవస్థానం

నిత్యాన్నదానానికి విరాళం



దాత రంగనాగ్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన నిమ్మకాయల రంగనాగ్ శనివారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్ము ఆలయ జూనియర్ అసిస్టెంట్ జగతా చిట్టిబాబుకు అందజేశారు. దాతను పలువురు అభినందించారు. దాతకు చిట్టిబాబు స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



మూలస్థాన అగ్రహారంలో రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

ఆలమూరు: పేదలకు అందిస్తున్న సేవలకు వక్ర భాష్యం చెబుతున్న ప్రతిపక్ష పార్టీల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ మండలంలోని మూలస్థాన అగ్రహారం గ్రామ సచివాలయాల పరిధిలోని 43 మంది గ్రామ వలంటీర్లు శనివారం మూకుమ్మడి రాజీనామా చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ రాజీనామాకు దారి తీసిన సంఘటనలను వారు వివరించారు. దేశ వ్యాప్తంగా వలంటీర్ వ్యవస్థపై ప్రశంసలు లభిస్తుంటే రాష్ట్రంలో మాత్రం బురద జల్లుతున్నారని దుయ్యబట్టారు. అందుకే గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలోని గ్రామ వలంటీర్లు అందరూ మూకుమ్మడి రాజీనామా చేశామన్నారు. ఈమేరకు రాజీనామా ప్రతులను గ్రామ పంచాయతీ కార్యదర్శి పాలింగి రాజుకు అందజేశారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంగాను, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని ఎమ్మెల్యేగాను మరోసారి గెలిపించుకుని సంక్షేమ రాజ్యాన్ని తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

అమలాపురం టౌన్: అగ్ని ప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై గత వారం రోజులుగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. అమలాపురం అగ్నిమాపక కేంద్రం అధికారి కేవీ మురళీ కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వారోత్సవాల్లో ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ముగింపు రోజున స్థానిక నల్ల వంతెన వద్ద గల అగ్నిమాపక కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిమాపక దళాధికారి కొండబాబు, లీడింగ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరామ్, సిబ్బంది విద్యార్థుల ఎదుట అగ్నిమాపక యంత్రాలు, పరికరాలను ప్రదర్శించి అవి ఎలా పనిచేస్తాయో ప్రయోగాత్మకంగా చూపించారు.



అగ్నిమాపక యంత్ర పరికరాల పనితీరును వివరిస్తున్న దళాధికారి కొండబాబు

స్ట్రాంగ్‌రూమ్‌కు చేరుకున్న ఈవీఎంలు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి శుక్రవారం జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంలన్నీ స్ట్రాంగ్‌రూమ్‌లకు శుక్రవారం అర్ధరాత్రి చేరుకున్నాయి. యానాం నియోజకవర్గంలో రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచే ప్రక్రియ శనివారం తెల్లవారుజాము వరకూ కొనసాగిందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి తెలిపారు. పుదుచ్చేరి లోక్‌సభ స్థానంలో యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్ రీజియన్లలోని 967 పోలింగ్ బూత్‌ల్లో 2,587 ఈవీఎంలు, 1,254 కంట్రోల్ యూనిట్లు, 1,324 వీవీప్యాట్ మెషీన్లను ఉపయోగించారు. అనంతరం వాటిని ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. యానాంలో స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ఎ.కుళోత్తుంగన్ మాట్లాడుతూ ఆయా స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పూర్తి భద్రతను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పుదుచ్చేరి వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నిక సందర్భంగా రూ.44 లక్షలు విలువజేసే 21,543 లీటర్ల లిక్కర్, రూ.8 లక్షల విలువైన 148.30 కేజీల డ్రగ్స్ సీజ్ చేసినట్లు చెప్పారు.

ఘనంగా లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

ఆలమూరు: గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా ప్రారంభమైంది. వేద పండితులు కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ, వెలవలపల్లి చైతన్యకృష్ణ నేతృత్వంలోని పురోహితుల బృందం ఈ పూజలను చేపట్టింది. ఈనెల 22న ఉదయం 10.49 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలియజేసింది. ప్రతిష్ఠాపన పూజల్లో భాగంగా శనివారం యంత్ర ప్రతిష్ఠ, బింబశిఖర ధ్వజ ప్రతిష్ఠ, గణపతి హోమం నిర్వహించారు.